ప్రజాశక్తి

బుధవారం 8 నవంబర్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు







సత్తెనపల్లి సభలో మాట్లాడుతున్న ఎంఎ గఫూర్



నరసరావుపేటలో స్వాగతం పలికేందుకు వచ్చిన శ్రేణులు

అసమానతలు లేని అభివృద్ధే ధ్యేయం

- రాష్ట్ర ప్రయోజనాలపై గొంతెత్తని వైసిపి, టిడిపి,జనసేన
- ప్రజా ఉద్యమాలపై సిఎం జగన్ నిర్బంధకాండ తగదు
- సిపిఎం ప్రజారక్షణ భేరి యాత్రలో ఎం.ఎ.గఫూర్
- పల్నాడు జిల్లా నరసరావుపేట, సత్తెనపల్లిలో సభలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి/పల్నాడు జిల్లా/సత్తెనపల్లి

దేశంలో అసమానతలు లేని అభివృద్ధి జరగాలని, సంపద అందిరికీ సమానంగా దక్కాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ అన్నారు. సిపిఎం నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరీ బస్సుయాత్ర మంగళవారం పల్నాడు జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లా కేంద్రమైన నరసరావుపేట, సత్తెనపల్లిలో బృందం పర్యటించింది. యాత్రకు నరసరావుపేటలో ప్రజలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుండి సత్తెనపల్లికి చేరుకున్న యాత్రకు వర్షంలో కూడా ప్రజలు పెద్దఎత్తున హాజరై స్వాగతం పలకడంతోపాటు సభ జరుగుతున్నంత సేపు వర్షం కురుస్తున్నా ప్రసంగాలను విన్నారు. సత్తెనపల్లిలో జరిగిన సభకు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్ అధ్యక్షత వహించారు. నర్సరావుపేటలో జరిగిన సభకు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అధ్యక్షత వహించారు. గఫూర్ మాట్లాడుతూ సంక్షేమ రాజ్యం అంటున్న జగన్ కరువు నివారణకు తగిన పరిష్కారం కనుగొనడంలో రైతులను, వ్యవసాయ కార్మికులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కరువుపై కేంద్రంతో కనీసం సంప్రందించకపోవడం దారుణమన్నారు. ఎకరాకు రూ.40 నుంచి రూ.50 వేల వరకు రైతులు నష్టోపోయారని, గుండ్లకమ్మ, పులిచింతల ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రైతులను ఇబ్బంది పెట్టి మూడు విడతలుగా రూ.13,500 ఇస్తే భరోసా సరిపోతుందా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ఆరు నెలలు మందు ఇచ్చే హామీలను నమ్మొద్దని, 2018లో చంద్రబాబు కూడా గోదావరి, పెన్నా అనుసంధానం పేరుతో శంకుస్థాపన చేసి హడావుడి చేశారు తప్ప ఫలితం లేదని గుర్తు చేశారు. ప్రజలపై ప్రేమ ఉంటే అధికారంలోకి వచ్చిన వెంటనే సంబంధిత పనులు చేపట్టి నాలుగేళ్లలో పూర్తి చేసి మళ్లీ ఓట్లు అడగాలన్నారు. తెలంగాణ ప్రభుత్వంకు అనుకూలంగా కృష్ణా జలాల విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుపట్టారు. ట్రిబ్యునల్ తీర్పును పున: సమీక్షకు అంగీకరిస్తే రాష్ట్రం ఎడారిగా మారుతుందన్నారు. తుంగభద్రపై మరో ప్రాజెక్టుకు కర్నాటకకు కేంద్రం అనుమతి ఇవ్వడాన్ని గఫూర్ ఖండించారు. రాష్ట్రంలో కృష్ణా పరివాహక ప్రాంతాన్ని ఎడారిగా మార్చేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని, ఇందుకు ప్రధాని నరేంద్ర మోడీ సూత్రదారిగా ఉన్నారని దుయ్యబట్టారు. అయినా రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన మాట్లాడటం లేదన్నారు. ప్రజల తరుపున అన్ని పార్టీలను కేంద్రం వద్దకు

2లో

రూ.40.73 లక్షల పురుగు మందులు సీజ్

రెండు కంపెనీలకు షోకాజ్ నోటీసులు



గోడౌన్లలో తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

వ్యవసాయ కమిషనర్ కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.మద్దులేటి, గుంటూరు అర్బన్ వ్యవసాయాధికారి బి.అంజిరెడ్డితో కలిసి ఆటో నగర్‌లోని పురుగు మందుల గోడౌన్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, వివా క్రాప్ సైన్స్‌లను తనిఖీ చేశారు. భారత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మోనోక్రోటోఫాస్ 36 శాతం పురుగుమందు తయారీని నిషేధించినా ఈ రెండు కంపెనీల గోడౌన్లలో అక్టోబర్ 23లో తయారైన మోనోక్రోటోఫాస్ ఉన్నందున వాటి నిల్వలను లెక్కించి మొత్తం రూ.40,73,322 విలువ గల 7510 లీటర్ల విక్రయాలను నిలిపేశారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు చెందిన రూ.38,97,822 విలువ గల 7060 లీటర్లు, వివా క్రాప్ సైన్స్‌కు చెందిన రూ.1, 75,500 విలువ గల 450 మోనోక్రోటోఫాస్ పురుగు మందును సీజ్ చేశారు. ఆయా కంపెనీలను షోకాజు నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదుగుదలే సాధికారత

వైసిపి బస్సు యాత్రలో మంతులు

4లో

కారంపూడిలో కుండపోత

వర్షంతో పైర్లకు జీవం - రైతుల్లో ఆందనం

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుండి ఏకధాటిగా కురిసిన వర్షానికి పొలాలు, రోడ్లు జలమయమయ్యాయి. వర్షం కారణంగా మిర్చి, కంది, ప్రతి పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవటం, తాగునీటికీ ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. అయితే గుంతల్లో చేరిన వర్షపు నీటితో వాహనదార్లు అసౌకర్యానికి గురయ్యారు.





విజేతలుగా ఆర్‌విఆర్ జెసి, ధనలక్ష్మి కాలేజీలు

ముగిసిన ఎఎన్‌యు బాస్కెట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుంటూరు

క్రీడారంగంలో ప్రపంచ దేశాల్లో భారతదేశ కీర్తిని చాటే విధంగా విద్యార్థులు రాణించాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాలలో రెండ్రోజులుగా జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్-కాలేజియేట్ బాస్కెట్‌బాల్ మెన్ అండ్ ఉమెన్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి జట్టు ప్రథమ స్థానంలో, ధనలక్ష్మీ ఫిజికల్ ఎడ్యుకేషనల్ కాలేజి ద్వితీయ, ఏసీ కాలేజి జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ధనలక్ష్మీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజి, వాగ్దేవి డిగ్రీ కాలేజి జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఇతర అతిథుల చేతులమీదుగా బహుమతులను, ప్రశంసా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఎఎన్‌యు యోగా కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ పి.గౌరీశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఎంటిఎంసికి నూతన కమిషనర్


ప్రజాశక్తి - మంగళగిరి

ఎంటిఎంసి కమిషనర్ యు.శారదాదేవి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు బదిలీ అయ్యారు. నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా నిర్మల్ కుమార్ నియమితులయ్యారు. ఈయనకు కార్పొరేషన్ రెగ్యులర్ కమిషనర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు కేటాయించారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ విభాగం నుండి మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి.



వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్ : వినియోగదారుల హక్కులపై అందరికీ అవగాహన ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పాఠశాలలలో కన్స్యూమర్ క్లబ్బులు ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ న్యూఢిల్లీ ప్రొఫెసర్ ప్రొఫెసర్ సురేష్ మిశ్రా తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వినియోగదారుల వ్యవహారాలపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రతి ఒక్కరికి వినియోగదారుల హక్కులు, బాధ్యతలు తెలిస్తే మెరుగైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. వినియోగదారుల రక్షణ చట్టం-2019 గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు పివివి ఎస్ మూర్తి, జిల్లా పౌరసరఫరాల అధికారి పి.కోమలి పద్మ, పి.రత్నం, సిహెచ్.హరిబాబు, తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి, ఎంఇఒ బలిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తెలుగు ఓటర్ల జాబితాలో తమిళ భాష

ప్రజాశక్తి-తాడేపల్లి : పట్టణంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 40 ఓటరు నెంబర్ 663/664లో ఓటరు లిస్టులోని పేర్లు తమిళంలో ప్రింట్ అయ్యాయి. కొత్తగా నమోదు చేసిన ఓటర్లను లిస్టులో చేర్చలేదు. మరణించిన వారి పేర్లు తొలగించలేదు. ప్రభుత్వం ప్రకటించిన ఓటరు లిస్టులో అవకతవకలు, తప్పులపై పలు పార్టీలు ఖండించాయి.

ఉల్లి ధర వింటే కళ్ల వెంట కన్నీరు

ప్రజాశక్తి-తాడేపల్లి : ఉల్లి ధర కోయకుండానే కన్నీరు పెట్టిస్తోంది. మంగళవారం పెద్దసైజు ఉల్లిపాయ కిలో రూ.80 పలికింది. ఇళ్ల వెంట ఆటోల మీద వచ్చిన చిన్నపాయలు కిలో రూ.40కే అమ్ముతున్నారు. ఇళ్ల వెంట తెచ్చిన పాయల్లో నాణత్య కనిపించకపోవడంతో పాటు పాయలు కొన్ని పాడైపోతున్నాయని మహిళలు చెబుతున్నారు. ప్రతిఏటా జనవరికి ముందు ఉల్లి ధర ఆకాశం వైపు చూస్తుందని మహిళలు చెబుతున్నారు. రాష్ట్రంలో పంట చేతికొచ్చే సమయంలో ఒక్కసారిగా ఉల్లి ధరలు పతనం అవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

టపాసుల విక్రయం కోసం స్థల పరిశీలన



ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో దీపావళి సామాను విక్రయించే వారు తాము నిర్థేశించిన స్థలంలోనే స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలని తహశీల్దార్ ఎం.నాగిరెడ్డి సూచించారు. సుందరయ్యనగర్ కరకట్ట మీద గల గుడ్‌న్యూస్ హైస్కూల్, ఉండవల్లిలోని దేవుడి మాన్యం స్థలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. మిగతా అధికారులతో చర్చించి అనువైన స్థలాన్ని ప్రకటిస్తామని చెప్పారు.

అసమానతలు లేని అభివృద్ధే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

తీసకువెళ్లి పోరడాల్సిన సిఎం జగన్ ఒక లేఖ రాసి చేతులు దులుపుకొంటున్నారని విమర్శించారు. విభజన హామీలను కేంద్రం విస్మరించినా సిఎం జగన్ మాట్లాడరని, పవన్ కల్యాణ్, చంద్రబాబు కూడా మోడీ పంచన చేరుతున్నారని ఎద్దేవ చేశారు. ప్రజా ఉద్యమాలపై టిడిపి హయాంలో చంద్రబాబు ఎలా నిర్బంధం అమలు చేశారో ఇప్పుడు అలాగే కొనసాగుతుందన్నారు. చంద్రబాబుకు జైలుకు వెళితే కాని నిర్బంధం ఎలా ఉంటుందో బోధపడలేదన్నారు. వైసిపి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, ఎన్నికల్లో అన్ని పార్టీలు చాక్లెట్ ఇచ్చి చెవికమ్మలు లాక్కునే వారేనని ఆయన ఎద్దేవా చేశారు. జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ సింహం, పులులు అని పిలిపించుకుంటారని కానీ మోడీ వద్దకు వెళ్లగానే వీరు పిల్లులుగా మారిపోతరాని అన్నారు. రాష్ట్రానికి బిజెపి చేస్తున్న ద్రోహాన్ని ప్రజలకు వివరిస్తూ కర్నూలు నుండి చేపట్టిన ప్రజారక్షణ బేరి యాత్ర ఈ నెల 15న విజయవాడ చేరుకుంటుందని విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు వి.కృష్ణయ్య, కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సోషలిజం ద్వారానే పేదలకు మేలు జరుగుతుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందరికి సమానంగా దక్కాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి రైతు, కూలీలు, కార్మికులు, కష్ట జీవులు సంపద మొత్తాన్ని అంబానీలకు దోచిపెడుతోందని, ఒకప్పుడు రూ.పదివేల కోట్లున్న అదాని, అంబానీల ఆస్తులు నేడు రూ.లక్షల కోట్లకు చేరుకుందని అన్నారు. ఆ సంపద మొత్తం దేశంలోని కోట్లాది మంది పేద ప్రజల వద్ద నుండి దోచిపెట్టిన సంపదేనని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పుడు రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1200 అయ్యిందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు, రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా రూ.200 తగ్గించిందని అన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే మనదేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు. సిపిఎం నాయకులు వి.శివనాగరాణి మాట్లాడుతూ వర్షాభావం వల్ల పల్నాడు జిల్లాలో వరి పైరు వేయలేదని, వేసిన పత్తి, మిర్చి పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. వేసిన పంట ఇంటికి రాకపోగా పెట్టిన పెట్టుబడులు, కౌలు కట్టలేక రైతులు అప్పుల పాలవుతుంటే, కనీసం ఆరుతడులకైనా నీరు ఇచ్చి ఆదుకోవాల్సిన మంత్రి అంబటి రాంబాబు ఏమి పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఒకవైపు దళితులపై దాడులు చేస్తున్న వైసిపి నాయకులపై ఏ విధమైన చర్యలు తీసుకోలేని ప్రభుత్వం సామాజిక బస్సు యాత్రలు పెట్టి దళితులను ఏమీ ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కాజేసిన వైసిపి ప్రభుత్వం సామాజిక బస్సు యాత్ర ఎలా చేస్తుందని ప్రశ్నించారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలు హత్యలు జరుగుతున్నా ఆ పార్టీతో అంటకాగుతున్న వైసిపికిని నమ్మడం ఎలాగని ప్రశ్నించారు. సత్తెనపల్లి పట్టణంలో ధోబి ఘాట్‌లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్లు, స్థలాలు వంటివి ఏమీ ఇవ్వకపోడతో ఆ కాలనీలో రోడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాల్లేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా స్లీపర్స్ కాలనీలో 40 సంవత్సరాలు నివాసముంటున్న వారికి ఇప్పటికీ పట్టాలు ఇవ్వలేదన్నారు. వర్షాలు లేక వ్యవసాయ పనులు లేక కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పట్టణాలలో కూడా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కరువు తీవ్రంగా ఉన్నా ఒక మండలాన్ని కూడా ఎంపిక చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వానికి పల్నాడు జిల్లాపై వివక్షేందుకని ప్రశ్నించారు. గతంలో ఇతర ప్రాంతాల నుంచి ఈ ప్రాంతానికి వ్యవసాయ కార్మికులు పనులకు వచ్చేవారని, ఇప్పుడు ఇక్కడివారే వలసెళ్తున్నారని తెలిపారు. వారానికి రెండు మూడు రోజులు కూడా పనులు దొరక్క వేలాది కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నాయన్నారు. బహిరంగ సభకు ముందుగా ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు సాంస్కృతిక నత్యాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రభాకరరెడ్డి, దయా రమాదేవి, భాస్కరయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయనాయక్, జి.రవిబాబు, సత్తెనపల్లి పట్టణ, మండల కార్యదర్శులు డి.విమల, పి.మహేష్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నరసరావుపేటలో బైక్ ర్యాలీ

ఓటర్ల జాబితాలో జంక్ క్యారెక్టర్లకు సవరణలు

ప్రజాశక్తి-గుంటూరు

ఓటర్ల జాబితాలో జంక్ క్యారెక్టర్లు, ఒకే ఇంటి నంబర్‌పై పది మందికి మించి ఓటర్లు ఉన్న ఇళ్లు, వందేళ్ళ పైబడిన ఓటర్లు గురించి విచారణ చేసి సవరించటానికి జిల్లా సంయుక్త కలెక్టర్లతో ముఖ్య ఎన్నికల అధికారి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశానికి జెసి జి.రాజకుమారి, డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు, అన్ని నియోజకవర్గాల ఈఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు హాజరయ్యారు. సమీక్షలో ముఖ్య ఎన్నికల అధికారి గుంటూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జంక్ క్యారెక్టర్లు, ఒకే ఇంటి నంబర్‌పై పది మందికి మించి ఓటర్లున్న ఇళ్లు, వంద సంవత్సరముల వయసు పైబడిన ఓటర్లు గురించి తనిఖీ చేసి, సవరణ చేసి, తుది జాబితా ప్రచురణలోగా తప్పులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జంక్ క్యారెక్టర్లు సంభందించిన 354గాను 339 పరిష్కరించారు. ఒకే ఇంట్లో పదికి మించి ఓటరుగా నమోదైన ఓటర్లకు సంబంధించి 26,937 పరిష్కరించారు. మిగిలిన జాబితాని రెండు వారాల్లో పరిష్కరిస్తామన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెసి రాజకుమారి

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి



ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల గౌరవాధ్యక్షులు ఎన్.శివాజి కోరారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశ వర్కర్స్ యూనియన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. శివాజి మాట్లాడుతూ ఆశాలకు జగనన్న సురక్ష పేరుతో పని భారం పెంచారని, అధికారుల వత్తిళ్లు అధికమయ్యాయని చెప్పారు. సెలవులు ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యలపై ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాలో అందరూ పాల్గొనాలని కోరారు. సమావేవంలో ఎం.ఇందిర, కె.కోటేశ్వరి, ఎన్.వరలక్ష్మి, జి.సుధా, జి.ప్రమీల పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన ఆశాల సమావేశంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడారు. పని భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాలకు రూ.10 వేలు ఇస్తూ కనీసం సెలవు కూడా లేకుండా వెట్టిచాకిరి చేస్తున్నారని, ఆన్‌లైన్ వర్క్ చేయిస్తున్నారని మండిపడ్డారు. గవర్నమెంట్ ఉద్యోగులని చెబుతూ ప్రభుత్వం ఇచ్చే ఏ పథకం వర్తింపజేయకపోవడం సరికాదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వైద్యాధికారి డి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.





ఆచార్య ఎన్‌జి రంగాకు జస్టిస్ లావు నాగేశ్వరరావు నివాళి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేసిన ఘనత ఆచార్య ఎన్జీ రంగాకు దక్కుతుందని సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ లావు నాగేశ్వరరావు కొనియాడారు. ఎన్జీరంగా 123వ జయంతి సందర్భంగా పొన్నూరులోని ఆయన విగ్రహానికి, సమాధి వద్ద జస్టిస్ లావు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా నిడుబ్రోలులోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎన్జీరంగా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆర్.కిషోర్‌బాబు, బి.రంగారావు, ఎ.జానకిబాబు, ఎమ్‌డి జలీల్, జి.వెంకయ్య పాల్గొన్నారు.

నేటి బంద్‌పై నోటీసులు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు నియోజకవర్గంలోని విద్యాసంస్థల్లో మంగళవారం నోటీసులు ఇచ్చి బంద్‌కు సహకరించాలని కోరారు.



హత్యాయత్నం కేసులో భర్తకు మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

హత్యాయత్నం కేసులో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ గురజాల అడిషనల్ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చినట్లు పిడుగురాళ్ల ఎస్‌హెచ్‌ఒ వీరాంజనేయులు మంగళవారం తెలిపారు. కేసు వివరాలు తెలుపుతూ పట్టణంలోని భవానినగర్‌లో నివసిస్తున్న తమ్మిశెట్టి మార్తమ్మను తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నాడు. కొంతకాలం సంసారం చేసిన తర్వాత వారికి ఇద్దరు పిల్లలు కలిగారు. ఆ తర్వాత ఆమెను వేధిస్తుండటం, చిత్రహింసలు పెట్టేవాడు. ఈ క్రమంలో 2017 సంవత్సరం మే 6వ తేదీన వెంకటేశ్వర్లు, మార్తమ్మను చంపాలనే ఉద్దేశంతో ఆమె గొంతుకు చీరను చుట్టి లాగుతుండగా, ఆమె పిల్లలు చుటు పక్కల వారు అడ్డురావడంతో అతను పారిపోయాడు. ఈ మేరకు మార్తమ్మ ఇచ్చిన రిపోర్టును అప్పటి పిడుగు రాళ్ల పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఆవులు హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అతన్ని అరెస్ట్ చేసి జైలుకు పంపి చార్జీట్ ఫైల్ చేశారు. గురజాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి లీల వెంకట శేషాద్రి మంగళవారం ఈ కేసు విచారణ జరిపారు. హత్యాయత్నం కింద వెంకటేశ్వర్లుకు మూడేళ్ల శిక్ష, జరిమానా విధించారు. మోసం చేసినం దుకు గాను మూడు నెలల శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 30,319
మిర్చి ఎగుమతి	: 31,690
మిర్చి నిల్వ	: 11,166

మిర్చి ధరలు

రూపాయలలో

334	8,000 - 23,500
నెం.5	9,500 - 19,500
273	11,000 - 19,000
341	11,000 - 21,000
4884	18,500 - 21,500
	నాన్ ఎసి
తేజ	9,200 - 24,000
బడిగి	10,800 - 23,500
దేవనూరు డీలక్స్	16,000 - 21,000
తాలుకాయలు	6,000 -14,500
	ఎసి
334	9,000 - 23,200
273	17,500 - 17,500
341	14,500 - 22,000
4884	17,000 - 19,200
తేజ	9,000 - 24,400
బడిగి	16,800 - 23,500
దేవనూరు డీలక్స్	17,000 - 20,000
తాలుకాయలు	8,000 -13,000

మాలదారుల నగదు, సెల్‌ఫోన్లు చోరీ

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని అంగలూరు గ్రామంలో వినుకొండ-కారంపూడి ప్రధాన రహదారి పక్కన ఉన్న శ్రీ నీలం పాటి అమ్మవారి గుడిలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొందరు మాల దారులు ఆలయంలో ఉంటున్నారు. వారు తెల్లవారు జామున గాఢ నిద్రలో ఉన్న సమయంలో ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ఆలయం వద్దకు చేరు కొన్నారు. వారిలో ఇద్దరు ఆలయంలోకి ప్రవేశించి గోడకు తగిలించి ఉన్న మాలదారుల చొక్కాల జేబుల్లో ఉన్న మొబైల్ ఫోన్లు, నగదును చోరీ చేశారు. తమ్మిశెట్టి శివరామయ్యకు చెందిన రూ. 15 వేలు నగదు, మొబైల్ ఫోన్, దేవళ్ల రవికి చెందిన మొబైల్ ఫోన్, ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ బైలడుగు నాగరాజు కు చెందిన రూ.10 వేలు నగదును చోరీ చేసి పరారయ్యారు. నిద్రలేచిన అనంతరం తమ చొక్కాల జేబుల్లోని నగదు, మొబైల్ ఫోన్‌లు లేకపోవడంతో చోరీ జరిగినట్లు మాల దారులు గుర్తించారు. చోరీకి సంబంధించి అక్కడే ఉన్న సిసిటివి కెమెరాలో నమోదైన దృశాల్యను పోలీసులు పరిశీలించారు. ఈ విషయమై స్థానిక పోలీస స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదే ఆలయంలో ఆరు నెలల కాలంలో రెండు పర్యాయాలు చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. నెల రోజుల క్రితం గుర్తు తెలియని దుండగులు ఆలయంలో హుండీని పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. అనంతరం చోరీలను అరికట్టేందుకు ఎస్సై షేక్ మహమ్మద్ ఆలయంలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేశారు. వరుస చోరీల నేపథ్యంలో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. పోలీ సులు గస్తీని పెంచి చోరీల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.



ఆలయంలో చోరీ చేస్తున్న దుండగులు (సీసీ కెమెరాలలో నమోదైన చిత్రం)



రౌడీ షీటర్ బైండోవర్

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని సుద్ధపల్లిలో బహిరంగ ప్రదేశంలో ప్రజలను ఇబ్బంది పెడుతూ, పశాంతతకు భంగం కలిగిస్తున్న మంగళవారం రౌడీ షీటర్ సుద్దపల్లి సురేష్‌ను మంగళవార బైండోవర్ చేసినటు చేబ్రోలు ఎస్సై కె.ఆనంద్, తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ తెలిపారు. ఎస్సై, తన సిబ్బందితో ఉదయం పదిగంటల సమయలో సుద్దపల్లి విలేజ్ సెంటర్‌కు చేరుకున్న సమయంలో, ప్రజలను సురేష్ ఇబ్బంది పెడుతుండటం గమనించినట్లు చెప్పారు. గతంలో చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో అతనికి పలు రకాల క్రిమినల్ కేసులతో ప్రమేయం ఉందని చెప్పారు.

బాణసంచా విక్రేతలకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-అమరావతి

దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా అమ్మకం దారులు తప్పని సరిగా పోలీసు అనుమతులు తీసుకోవాలని సిఐ బ్రహ్మం అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం గోడౌన్ నిల్వలకు, అమ్మకం దారులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

తరుచు ప్రమాదాలకు నిలయంగా మారిన పట్టణం లోని 6,7, 8 వార్డుల జంక్షన్ వద్ద మంగళవారం మున్సిపల్ అధి కారులు స్పీడ్ బ్రేకర్స్ ను ఏర్పాటు చేయడంపై స్థానికులు సంతో షం వ్యక్తం చేశారు. ఈ రోడ్ల కూడలిలో ఒకవైపు ఆసుపత్రులు , పాఠశాలలు , మరొక వైపు బ్యాంకు , దేవాలయలు ఉండటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఇక్కడ పరిస్థితి గమనించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారని అన్నారు.

10న అమరావతిలో సామాజిక సాధికార యాత్ర

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఈ నెల 10వ తేదీన పెదకూరపాడు నియోజకవర్గం అమరావతిలో జరిగే సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ధరణి కోట జేబీ గార్డెన్స్ లో 10వ తేదీ మధ్యాహ్నం సామాన్యులతో, ముఖ్య కార్యకర్తలతో ఎంపీ విజయసాయిరెడ్డి విడివిడిగా సమావేశమవుతారన్నారు. సాయంత్రం 4 గంటలకు జేబీ గార్డెన్స్ నుంచి పాదయాత్ర ప్రారంభం అవు తుందని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు అమరావతి రథం సెంటర్ లో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.



చెంచయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

జర్నలిస్ట్ చెంచయ్య గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-అమరావతి



మండలంలోని నరుకుళ్లపాడు గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కుర్రా చెంచయ్య గుండె పోటుతో మరణించారు. భౌతిక కాయానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.పత్రికా రంగంలో 35 ఏళ్ల పాటు ఎనలేని సేవలందించిన చెంచయ్య మృతి తీరని లోటు అన్నారు. విలువలతో కూడిన వార్తలతో ప్రజలకు న్యాయం చేసిన వ్యక్తి చెంచయ్య అని కొనియాడారు.



ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు అవకాశం

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు తెలియజేయవచ్చునని పెదకూరపాడు మండల తహశీల్దార్ జియా కోరారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితా ముసాయిదా ఉందన్నారు. దానిని ప్రతి ఒక్కరూ పరిశీలించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి, టిడిపి నాయకులు, బెల్లంకొండ తహశీల్దార్ క్షమారాణి పాల్గొన్నారు.



విద్యార్థినులకు కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి- క్రోసూరు

క్రోసూరు పరిసర ప్రాంత ప్రజలకు శంకర కంటి ఆసుపత్రి అందిస్తున్న సేవలు అత్యంత ఉపయోగకరంగా ఉన్నాయని రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్ అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో క్రోసూరులోని కస్తూర్బా బాలికల విద్యాలయంలోని విద్యార్థినులకు వారం క్రితం కంటి పరీక్షలు నిర్వహించారు కంటి పరీక్షల్లో అవసరమైన విద్యార్థులకు మంగళవారం క్రోసూరులోని శంకర్ విజన్ సెంటర్‌లో కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షేక్ మస్తాన్ విచ్చేసి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. మస్తాన్ మాట్లాడుతూ 50 మంది విద్యార్థులకు కళ్ళజోళ్ళు పంపిణీ చేసినట్లు చెప్పారు. కంటి జబ్బులు రాకుండా విద్యార్థి దశలోనే మంచి పౌష్టికాహారం, కాయగూరలు, ఆకుపచ్చని కూరలు, విటమిన్ ఎ ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శంకర కంటి ఆసుపత్రి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ హనుమంతరావు, కౌన్సిలర్ వి.ప్రమీల, ఆప్తాలిక్ కరుణ శ్రీ, ఔట్రీచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదుగుదలే సాధికారత

ప్రజాశక్తి - వినుకొండ





సభలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, విటంరాజుపల్లి నుండి నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న మంత్రులు ఎంపిలు, ఎమ్మెల్యే తదితులు

ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సాధికారత సాధ్యమవుతుందని, రాష్ట్రంలో సామాజిక సాధికారత సీఎం జగన్ మోహన్ రెడ్డి సొంతమని వైసిపి మంత్రులు నేతలు అన్నారు. సామాజిక సాధికారత బస్సు యాత్ర మంగళవారం వినుకొండలో జరిగింది. విటంరాజుపల్లి గ్రామం నుండి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తో పాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, వైసిపి నేతలు పాల్గొన్నారు. అనంతరం స్థానిక కారంపూడి రోడ్డు లోని ప్రభుత్వ వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన సభలో మంత్రులు ప్రసంగించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని మాట్లాడుతూ పదవుల్లో అత్యధిక శాతం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఉన్నారని, జగన్మోహన్ రెడ్డి సామాజిక న్యాయ పాటించడం వలన వార్డు మెంబర్ నుండి రాజ్యసభ ఎంపీ వరకు అవకాశాలు వచ్చాయని అన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ కోర్టులో కూడా అబద్దం చెప్పి చంద్రబాబు బెయిల్ తెచ్చు కున్నారని, కోర్టులను మోసి చేసిన వ్యక్తి మనల్ని మోసం చేయడాన్ని ఎద్దేవా చేశారు.

మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబునాయుడు దళితులను అవమానిస్తే జగన్ మాత్రం బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను గుండెల్లో పెట్టుకొని చూసుకున్నాడని తెలిపారు. పేద వాడు చదువుకోవాలని, వైద్యం చేయించుకోవాలని జగన్ ఆలోచించి అనేక కార్యక్రమాలు చేశారన్నారు. దళిత హక్కులను చంద్రబాబు కాలా రాశారని, ఎంపి శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నవంబర్ 17వ తేదీన మాచర్లలో సీఎం జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదగా ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. సినీ నటుడు, ఎలక్ట్రానిక్ మీడియా చైర్మన్ ఆలీ మాట్లాడుతూ బ్రహ్మ నాయుడుని యాభై నాలుగు వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పిన్నెల్లి రామకష్ణారెడ్డి, వినుకొండ నియోజకవర్గ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారికతను అమలు చేసిన ఘనత సీఎందే

రాష్ట్రంలో అణగారిన వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా సామాజిక సాధికారికత ను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సామాజిక సాధికారిక బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం వినుకొండ మండల పరిది లోని విఠంరాజుపల్లికి చేరిన పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు పాత్రికేయుల సమావేశం నిర్వ హించారు.

నేటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

నేడు రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థలు బం ద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు పిడుగురాళ్లలో మంగళవారం బంద్ నోటీ సులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ మాట్లాడుతూ 32 మంది విద్యార్థులు, యువకుల ప్రాణ త్యాగం , అనేక మంది రైతులు తక్కువ ధర కి భూమిని అందించి నిర్మించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తుంటే రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు చూస్తూ కూర్చోవటం బాధాకరమన్నారు. నవంబర్ 8 న జరుగు రాష్ట్ర వ్యాప్త బంద్ లో విద్యాసంస్థలు స్వచ్ఛందంగా పాల్గొ నాలని, ప్రజలు, విద్యార్థులు, యువకులు పెద్దఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రోహిత్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- క్రోసూరు

రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థలు బంద్ నోటీసులను క్రోసూరు, అచ్చంపేట మండ లాల్లోని అన్ని పాఠశాలలకు ఎస్ఎఫ్ఐ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన హామీల ప్రకారం ప్రభుత్వ రంగంలో నిర్మించాల్సిన కడప ఉక్కు పరిశ్రమను ప్రైవేటు రంగంలో నిర్మించటం రాష్ట్రానికి పాలకులు చేస్తున్న ద్రోహం అన్నారు.



క్రోసూరులో విద్యా సంస్థల బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



పిడుగురాళ్లలో బంద్ నోటీసులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సివి రామన్, మేడం క్యూరీ జయంతి

ప్రజాశక్తి - మాచర్ల



జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాచర్ల ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రముఖ శాస్త్రజ్ఞులు సివి రామన్, మేడం క్యూరీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్.వి.ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్, జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు వై.వెంకట్రామయ్య అధ్యక్షత వహిం చారు.

ఈ సందర్భంగా వెంకట్రామయ్య మాట్లా డుతూ జన విజ్ఞాన వేదిక ఆశయాలను వివరించారు. సివి రామన్, మేడం క్యూరీల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి విద్యార్థినీ, విద్యార్థులు చేరుకోవాలని కోరారు. మరో గౌరవాధ్యక్షులు, సీనియర్ లెక్చరర్ కేలం ఆదినారాయణ మాట్లా డుతూ రామన్ పరిశోధించిన ఎఫెక్ట్ గురించి దాని అనువర్తనాలను వివరించారు. రామన్ పరి శోధన కారణంగా రసాయనిక పదా ర్థాలలో అణువుల నిర్మాణాలను వివరించటానికి ఉపయోగ పడతాయని అన్నారు. కళాశాల డైరెక్టర్, జన విజ్ఞాన వేదిక సభ్యులు బీమా వేణుగోపాలరావు మాట్లా డుతూ పరమాణు భౌతిక శాస్త్రము, రేడియో ధార్మికత, రేడియో థెరఫీ లాంటి వాటికి మేడం క్యూరీ ఆద్యురాలని అన్నారు. కళాశాల విద్యార్థి ఎర్రం శెట్టి శశి శంకర మాట్లాడుతూ మూఢనమ్మ కాలను పారదోలడానికి విజ్ఞాన వేదిక కృషి చేయాలని చెప్పారు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసిన వారి పేర్లను ఓటర్ల జాబితాలో ఎందుకు చేర్చలేదని అధికారులను రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రశ్నిం చారు. సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో నియోజక వర్గ స్థాయి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అధికారులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆర్డిఓ బిఎల్ఎన్ రాజకుమారి అధ్య క్షతన సమావేశం జరిగింది. ఓటర్ల జాబితాపై అభ్యం తరాలు, సూచనలను స్వీకరించారు. నియోజకవర్గ స్థాయిలో గతంలో ఫైనల్ పబ్లికేషన్ నుండి ఇప్పటి వరకు చేర్చబడిన, తొలగింపబడిన, సవరింపబడిన ఓటర్ల వివ రాలను అధికారులు తెలియజేశారు. జీరో డోర్ నంబర్లు, పది కన్నా ఎక్కువ మంది ఓటర్లు కలిగిన డోర్ నంబర్లు, 100 సంవత్సరాల వయస్సు పైబడిన ఓటర్ల వివరాలు, సవరణలు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆళ్ళ సాంబయ్య, యర్రా వెంకటేశ్వర రావు సిపిఐ నాయకులు ఇర్మియా, తహశీల్దార్ సురేష్ , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులో పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రజాశక్తి -కారంపూడి



ఏ చిన్నపాటి వర్షం కురిసిన మురుగునీరు, వర్షపు నీటితో సినిమా హాలు పక్క బజారు అధ్వానంగా తయారైంది. సినిమా హాలు సమీపంలోని బజారులో మోకాలు లోతు మురుగునీరు, వర్షపు నీరు నిల్వ ఉండ డంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని వడ్డెర కాలనీ, యాదవుల బజారు, తదితర ప్రాంతాల్లో మురుగునీరు సాయిబాబా గుడి సమీపం నుండి పల్నాడు ఐనాక్స్ సినిమా హాలు పక్క బజారు నుండి నాగులేటిలో కలిసేది. వర్షపు నీరు కూడా ఈ కాలవ ద్వారానే నాగులేరులో కలిసేవి. ఇటీవల సినిమా హాలు సమీపంలో నూతనంగా అపార్టుమెంట్ నిర్మించారు. ఆర్అండ్‌బి రోడ్డు నుండి అపార్టుమెంట్ వరకు సిసి రోడ్డును నిర్మించారు. మధ్యలో మురుగునీరు, వర్షపు నీరు వెళ్లేందుకు చిన్న కల్వర్టు ఉండేది. కల్వర్టులో రాళ్లు, చెత్త, చెదారం పేరుకుపోయాయి. మురుగు నీరు, వర్షపు నీరు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఆ ప్రదేశమంతా దుర్గంధం వస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కల్వర్టును హై లెవెల్ కల్వర్టుగా నిర్మించి మురుగునీరు, వర్షపు నీరు పోయేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయితి సెక్రటరీ కసన్య నాయక్ ను వివరణ కోరటానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

బస్సు యాత్రకు ఘనస్వాగతం పలకండి

- ఆ మూడు పార్టీలు ప్రజలకు సమాధానం చెప్పాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఎం ప్రజా రక్షణభేరి బస్సు యాత్ర ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఉండవల్లి సెంటర్‌కు రానున్న సందర్భంగా ఘనంగా స్వాగతం పలకాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. సిపిఎం తాడేపల్లి పట్టణ, రూరల్, రాజధాని విస్తృత సమావేశం స్థానిక మేకా అమరారెడ్డి భవన్‌లో మంగళవారం జరిగింది. సమావేశానికి పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. రామారావు మాట్లాడుతూ పట్టణంలోని సాయిబాబా గుడి వద్ద నుంచి బస్సు యాత్రకు బైక్ ర్యాలీతో స్వాగతం పలుకుతారని చెప్పారు. అక్కడ నుంచి ఉండవల్లి సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ పాల్గొని మాట్లాడతారని తెలిపారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపితో వైసిపి, టిడిపి, జనసేన ఎందుకు మద్దతిస్తున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. విభజన హామీలను అమలు జరపకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని బొందలో పెట్టాలని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు అమలు జరపని విద్యుత్ సంస్కరణలతో సహా అన్నింటినీ బిజెపి చెప్పినట్లు రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమలు చేస్తుందని మండిపడ్డారు. ఆస్తి, చెత్తపన్ను పెంచి ప్రజల నడ్డి విరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో దేశం మొత్తం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తున్నా దేశంలో ఎక్కడా లేని విధగా రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఆ పార్టీ పంచన చేరడం సిగ్గుచేటన్నారు. పెరిగిన ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రధానంగా రైతులకు అవసరమైన పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ ఛానల్ కింద పంటలు ఎండిపోయి రైతులు నష్టాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో 20 వేల కుటుంబాలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రెయినేజీ సమస్య అస్తవ్యస్తంగా మారిందని, దీనిని వెంటనే సరిచేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, నాయకులు డి.శ్రీనివాసకుమారి, కె.కరుణాకరరావు, వి.దుర్గారావు, ఎ.శౌరిబర్తులం, కె.మేరి, డి.విజయబాబు పాల్గొన్నారు.



బహిరంగ సభ జయప్రదం కోసం సిపిఎం నాయకులు పలు ప్రాంతాల్లో కార్మికులు, ప్రజలను కలిసి కరపత్రాలు పంపిణీతో ప్రచారం చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, నాయకులు డి.శ్రీనివాసకుమారి, బి.గోపాలరెడ్డి, డి.యోహాన్, వి.వెంకటేశ్వరరావు, యు.పార్ధసారధి, పి.శివయ్య, ఎస్.రాములు, మస్తానరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

సిపిఎం చేపట్టిన బస్సు యాత్ర గురువారం ఉదయం 9 గంటలకు తెనాలికి చేరనుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ కోచెప్పారు. స్థానిక చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం అనేక మంది మేధావులు విద్యావేత్తలతో సిపిఎం పలు సదస్సులు నిర్వహించి ప్రణాళిక రూపొందించిందని, దానిని ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం మూడు బస్సు యాత్రలను నిర్వహిస్తోందని అన్నారు. అందులో ఒక బస్సు యాత్ర గుంటూరు జిల్లాలో పర్యటిస్తుందని, గురువారం ఉదయం అన్నాబత్తుని పుర వేదిక వద్ద జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం 11 గంటలకు బస్సు యాత్ర



గుంటూరుకు బయలుదేరుతుందని, అక్కడి నుంచి పెదకాకాని, కాజా, మంగళగిరి, తాడేపల్లి మీదుగా విజయవాడ చేరుకోవటంతో యాత్ర ముగుస్తుందని వివరించారు. మూడు బస్సు యాత్రలు విజయవాడ చేరుకున్న అనంతరం నవంబర్ 15వ తేదీన విజయవాడలో పెద్ద ఎత్తున బహిరంగ సభ జరుగుతుందన్నారు. సభలో ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సిపిఎం తెనాలి ఏరియా కార్యదర్శి కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో విఫలమైన అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశారని విమర్శించారు. తెనాలి పరిసర ప్రాంతాల్లో కాలువలకు నీరు సరిగా రాక మాగాణి భూములు ఎండిపోతున్నాయని, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు బాధలు పడుతున్నారన్నారు. ప్రజలపై మోపిన చెత్త పన్ను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి, పి.జోనేష్, ఎం.ఎలమందయ్య పాల్గొన్నారు.



ప్రజాశక్తి-గుంటూరు

ప్రజారక్షణ భేరి రాష్ట్ర బస్సు జాతా ఈనెల 9వ తేదీన గుంటూరు వస్తున్న సందర్భంగా ఉదయం 11 గంటలకు పాత బస్టాండ్ సెంటర్‌లో సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ తెలిపారు. ఈ జాతాలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ పాల్గొంటారన్నారు. మంగళవారం స్థానిక హిందూ కాలేజి కూడలిలోని ఆటో స్టాండ్ వద్ద ప్రజారక్షణ భేరి ఆటో స్టిక్కర్లను ఆవిష్కరించారు. పలు ఆటోలకు స్టిక్కర్లు అంటించారు. నళినీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో రూ.10వేలు నగదు ఇస్తుందని, అదే సందర్భంలో మరోవైపు ఇన్సూరెన్స్, ఫీజులు, పెనాల్టీల పేరుతో రెట్టింపు వసూలు చేస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను నీర్చుగార్చుతుందని, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను అరికట్టలేకపోతుందన్నారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెంచిందన్నారు. మరోవైపు ఉపాధి, నిరుద్యోగం పెరిగి, ప్రజల జీవనం అస్థవ్యస్థంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో 15వ తేదీన జరిగే జరిగే బహిరంగ సభను, గుంటూరులో 9న జాతా సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్, బి.ముత్యాలరావు, ఎ.నికల్సన్, మస్తాన్‌వలి, కొండలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక బోస్ బోసు బొమ్మసెంటర్, చెన్నకేశనగర్, శివాలయం సెంటర్, లూథరన్ చర్చి సెంటర్లో కరపత్రాలు పంపిణీతో ప్రచారం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి



జె.బాలరాజు మాట్లాడారు. బ్రహ్మేశ్వరావు, అమ్మిరెడ్డి, కృష్ణా నాయక్, సాంబనాయక్, రాములు నాయక్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక ఎస్టీ కాలనీ, చెరువులోపాలెంలో ప్రచారం చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడారు. రవి, బి.కొండలు, బన్ను పాల్గొన్నారు.



ప్రజాశక్తి-మంగళగిరి

సభ పోస్టర్‌ను పట్టణంలోని 22 వార్డులోగల సింహాద్రి శివారెడ్డి భవనంలో ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ, నాయకులు ఎం.చంద్రశేఖరరావు, బి.స్వామినాథ్, ఆదినారాయణ, నాగేష్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని చిన్నకాకానిలో ప్రచారం చేశారు. నాయకులు వి.పూర్ణయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని తెనాలి రోడ్డు విస్తరణలో స్థలాన్ని కోల్పోతున్న భవన యజమానులకు భూ సేకరణ 2013 చట్టాన్ని అమలు చేసి న్యాయం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య కోరారు. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. టిడిఆర్ బాండ్లు కాకుండా నష్టపరిహారం నగదు రూపంలో ఇవ్వాలన్నారు. కమిషనర్‌తో జరిగిన సమావేశంలో భవన యజమానులు అడిగిన న్యాయమైన కోరికలను అమలు చేయాలని కోరారు. రోడ్డుకిరువైపులా స్థలాన్ని సమానంగా తీసుకోవాలన్నారు. దేవస్థానం వద్ద గడ్డర్లను ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, గతంలో భారీ వాహనాలను కాకుండా, కారు ఆటోలను అనుమతించారని గుర్తు చేశారు. గడ్డర్లను తొలగించాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ పట్టా లేని వారి కూడా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రజలు కోరుకుంటున్న తెనాలి రోడ్డు విస్తరణ కార్యరూపం దాల్చడం లేదన్నారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య, పి.బాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాంద్‌బాషా

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కోరారు. స్థానిక నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులకు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు సరైన వైద్య సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించటమే కష్టంగా ఉన్న నేపథ్యంలో, ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే మెరుగైన వైద్యం చేయించుకోలేకపోతున్నారని చెప్పారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్యామ్‌కుమార్, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, బి.శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి కనకారావు, దక్షిణామూర్తి పాల్గొన్నారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న ఖాసిం

ఉర్దూ పాఠశాలలో డిఐ ఖాసిం తనిఖీలు

ప్రజాశక్తి-మేడికొండూరు

మండలంలోని డోకిపర్రులోని మండలపరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి ఎమ్‌డి.కాసిం మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన నో కాస్ట్‌లో కాస్ట్ ప్రాజెక్ట్ వర్క్స్ పరిశీలించి అభినందించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమ్మేటివ్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండలంలోని తుర్కపాలెంలో మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు నాణ్యతలో రాజీలేకుండా అందించాలన్నారు.

చిరు వ్యాపారికి తోపుడు బండి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



కొలనుకొండలోని చిరు వ్యాపారి నాలాది సామ్రాజ్యంకు తోపుడు బండిని టిడిపి నాయకులు మంగళవారం అందజేశారు. చిరు వ్యాపారం చేసుకునే తనకు తోపుడు బండి లేకపోవడంతో అద్దె బండిపై వ్యాపారం చేసుకుంటున్నానని ఆమె తెలపగా ఈ బండిని సమకూర్చారు. ఇందుకుగాను ఆమె టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు, గ్రామ అధ్యక్షులు కె.రంగారావు, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు యు.సత్యనారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షులు ఆర్.రాజేష్, ఎ.అర్చన, బి.భూపతిరావు, టి.ఏలియా, బి.అయ్యప్ప, పాగోలు దాసు, జయప్రకాష్, బి.సుబ్బమ్మ, కె.నాగేశ్వరమ్మ, కె.సుబ్బాయమ్మ, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్సి ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో గత నెల 16న ప్రారంభమైన ఇవి ఎంలు, వివి ప్యాట్స్ ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావర ణంలో సజావుగా జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ చెప్పారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో వివిప్యాట్స్ గోడౌన్ లో నిర్వహిస్తున్న ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ పరి శీలనలో భాగంగా ముందుగా సిబ్బంది హాజరు పట్టికను, సెక్యూరిటీగా విధులు నిర్వ హిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. గోడౌన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఎన్నికలు సెక్షన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రక్రియ నవంబర్ 10వ తేదీ వరకు నిరంతరాయంగా జరుగుతుందని కలెక్టర్ చెప్పారు.



'విద్యార్థుల సంక్షే మాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధా న్యత ఇస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే ఉన్నాయో తప్ప ఆచ రణలో ఘోరంగా విఫలమయ్యా రని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. శ్రీను నాయక్ అన్నారు. మం గళవారం పట్టణంలోని ఎన్నార్టీ సెంటర్లో సం ఘం కార్యా లయంలో విలేకరులతో ఆయన మా ట్లాడుతూ పల్నాడు జిల్లాలోని నరస రావుపేట, లింగం గుంట్ల, మాచర్ల, సత్తెన పల్లి, పిడుగురాళ్ల, మోర్జంపాడు, మాచ వరం,అచ్చంపేట, చిలకలూరిపేటతో పాటు ఆయా నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ, బి.సి,బాలుర, బాలిక వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మరుగుదొడ్లు, లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవు తున్నారు.కొన్ని వసతి గృహాల్లో భవనం పెచ్చులు ఊడుతున్నాయని అ న్నారు. చలికాలం మొద లైంది కనుక నూలు దుప్పట్లు పం పిణీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వం అల సత్వం వహిస్తోందని విమ ర్శించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బి.చిన్న నాయక్, ఉపాధ్యక్షులు దేవర డేవిడ్ పాల్గొన్నారు.



విధి నిర్వహణయే ఘనతకు మార్గం

ప్రజాశక్తి-క్రోసూరు

ఉద్యోగులకు విధి నిర్వహణే ఘనతకు మార్గం అని పల్నాడు జిల్లా మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ డివిఎస్ రమాదేవి అన్నారు ఇటీవల క్రోసూరు మండలంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జయప్రదం చేసినందుకు గాను పిహెచ్సి సిబ్బందికి మంగళవారం అభినందన సభ జరిగింది ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ సిబ్బంది అందరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో విశేష కృషి చేశారని వారందరికీ అభినందనలు కతజ్ఞతలు తెలియజేశారు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో క్రోసూరు పి హెచ్ సి ని ఇదే స్ఫూర్తితో అగ్రగామిగా ఉంచాలని ఆమె కోరారు కోవిడ్ సమయంలో వైద్య ఉద్యోగుల కషి ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఆమె కొనియాడారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి



పిఎం కిసాన్ నగదు పంపిణీలో మెగా చెక్కు విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. వైఎస్ఆర్ రైతు భరోసా వరుసగా 5వ ఏడాది రెండో విడత పిఎం కిసాన్ నగదు పంపిణీ కార్యక్రమం మంగళవారం స్థానిక సమావేశ మందిరంలో జరిగింది.సత్య సాయి జిల్లాలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించిన కార్యక్రమాన్ని జిల్లాలో రైతులు వీక్షించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.ఈ సంద ర్భంగా జిల్లాలోని 2,79,609 మంది రైతుల కుటుంబాలకు రూ. 115.8 కోట్ల మెగా చెక్కును జిల్లా కలెక్టర్ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ పిఎం కిసాన్ నిధులు రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. రైతుల సంక్షేమ పాలన రాష్ట్రంలో సాగుతోందని చెప్పారు రైతు లను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వ్యవసాయంలో నిత్యం పండగ వాతావరణం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పంటల కోత సమయంలో రైతులను ఆదుకోవ డానికి నగదు పంపిణీ చేయడం శుభపరిణామం అన్నారు. ఈ క్రాప్ బుకింగ్ నుంచి సున్నా వడ్డీతో పంటల బీమా వర్తింప చేస్తూ రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలిచిందన్నారు. రైతులకు ప్రభుత్వం మేలు చేస్తుండగా వరుణుడు కూడా వర్షాలతో సహకరిస్తు న్నారని చెప్పారు. వర్షాలు కురవడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరిం చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సం క్షేమ కార్యక్రమాలను రైతులు సద్వి నియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. పంటల కోత సమయంలో రైతు లను ఆదుకోవడం శుభ పరిణామ మని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మార్కెండేయరెడ్డి అన్నారు. కార్య క్రమంలో జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి మురళి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు ప్రజలను కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని 12వ వార్డులో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి అంబటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం విద్యా, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిం చింది అన్నారు . ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువచేసిందని అన్నారు. ప్రతి వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. వైద్య పరీ క్షల్లో రోగ నిర్ధారణ జరిగితే వారికి చికిత్స అందిస్తారని అన్నారు.

ఏమి చేశారని సామాజిక సాధికారత బస్సు యాత్రలు?

ప్రజాశక్తి - వినుకొండ



మాట్లాడుతున్న జివి ఆంజనేయులు

రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,ముస్లిం మైనారిటీలకు తీరని ద్రోహం చేసిన జగన్ రెడ్డి ప్రభుత్వం ఏమి చేశారని సామాజిక సాధికారత బస్సు యాత్రలు చేస్తున్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ప్రశ్నించారు. మంగళవారం రాత్రి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ వర్గాలను అన్ని విధాల ఆదుకుంటానని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన జగన్ రెడ్డి గద్దెనెక్కిన వెంటనే కార్పొరేషన్ నిధులు నిలిపివేసి అన్ని వర్గాలను దగా చేయటం జరిగిం దన్నారు. కార్పొరేషన్లు పెట్టి నిధులు ఇవ్వకుండా ఖాళీ కుర్చీలు మిగిల్చిన సీఎం జగన్మోహన్ రెడ్డిని ఈ మంత్రులు ఎందుకు ప్రశ్నించారు అని నిలదీశారు. బడుగు బలహీన వర్గాలకు ద్రోహం చేసిన వైసీపీ ప్రభుత్వం సామాజిక సాధికారత బస్సుయాత్ర చేపట్టటం విడ్డూరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీలపై దాడులు చేసి అక్రమ కేసులు బనాయించి దళితులను అఘోరపరుస్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఈ మంత్రులు ఎందుకు నిలదీరని ప్రశ్నించారు. మంత్రి పదవులు ఇచ్చారు కానీ ఆయా శాఖలపై వారికి లేదని కేవలం పేరుకు మంత్రులే తప్ప వారికి వెన్నుముకలేని మంత్రులని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ 35 శాతం నుండి 20 శాతానికి తగ్గించడం వలన 16800 మంది బీసీలు పదవులు కోల్పోయారని దీనిపై సీఎంను మంత్రి విడదల రజిని ఎందుకు ప్రశ్నించారు అని ఆయన ఎద్దేవా చేశారు. నాలుగున్నర ఏళ్లలో బీసీల హక్కుల గురించి బీసీ కార్పొరేషన్ నిధుల గురించి ఎన్నడైన మంత్రి రజిని ప్రశ్నించారా అని అన్నారు.

సామాజిక వర్గాలపై దగాయాత్ర

ప్రజాశక్తి - వినుకొండ



వైసిపి నాయకులు చేస్తోంది సామాజిక సాధికార యాత్ర కాదని, సామాజిక వర్గాలపై దగా యాత్ర అని సామాజిక ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్ సిపిఐ ఎంఎల్ కార్యాలయంలో మంగళవార జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లా డుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని ,ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను నవరత్నాల్లో కలిపి ఇది సామాజిక న్యాయమని దళితులను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు మొత్తం అటకెక్కించి మోసం చేశారని ఆరోపించారు. ఇది ఆదిపత్య శక్తులు, వర్గాలతో చేసే బస్సు యాత్ర అని, సామాజికగా వెనుక బడిన వర్గాలు ఈ యాత్రలో భాగస్వాములు కావద్దని సూచించారు. 800 నామినేట్ పదవుల్లో ఏడు వందలకు పైగా రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించడమేనా సామాజిక సాధికారత అని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బిజెపితో కుమ్మక్కై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వ్యతిరేకంగా అనేక చట్టాలకు అనుకూలంగా జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం మద్దతు ప్రకటించిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకగా పోరాలడాలని తీర్మానించారు. సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటనాయక్, ఎ.వెంకటేశ్వర్లు, బిసి నాయకులు, షేక్. ఫిరోజ్, మైనారిటీ నాయకులు, డిహెచ్పిఎస్ బి.శ్రీనివాసరావు, పిడిఎం రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వరరావు, మాల మహానాడు నాయకులు కె.వెంకటేశ్వర్లు, ఎమ్మార్పిఎస్ వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులు, ఆర్.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



జీవన నైపుణ్యాలపై అవగాహన

ప్రజాశక్తి -క్రోసూరు

మండల కేంద్రంలోని క్రోసూరు జిల్లా పరిషత్ స్కూల్ మరియు దొడ్లేరు గ్రామములోని జిల్లా పరిషత్ స్కూల్ లోని బాలలకు గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ అమరావతి వారు జీవన నైపున్యాలు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. సుపీరియర్ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బాలలకు జీవితంలో ఎదగటానికి మంచి ఆలోచనతో ఉన్నతమైన భావాలతో ముందుకు వెళ్ళాలంటే ప్రతి ఒక్కరికి ఇవి అవసరం అని తెలిపారు . రిసోర్స్ పర్సన్ జీ.తిరుపతిరావు గారు బాలలకు సోషల్ స్కిల్స్, తింకింగ్ స్కిల్స్, ఎమోషన్ స్కిల్స్ డెసిషన్ మేకింగ్ మొదలైనవి ప్రధానంగా మనకు తెలిసి ఉండాలని, కొత్త ఆలోచనలు , సృజనాత్మకతను చూపేవిధంగా వుండాలని అన్నారు. సిస్టర్ డియా నాగరు మాట్లాడుతూ బాలలు జీవన నైపుణ్యాలు గూర్చి తెలుసుకోవడం ఉత్తమ లక్షణం అని అన్నారు. రిసోర్స్ పర్సన్ నూతక్కి దిలీప్ కుమార్ మాట్లాడుతూ బాలలు కొన్ని సందర్భాలలో ఒత్తిడికి గురవుతారని, ఎప్పటి పని మనం అప్పుడే పూర్తి చేసుకోవాలని, అప్పుడు బాలలు మనోవికాసంతో మంచి ఆలోచనలతో ముందుకు వెళ్తారని తెలిపారు. చిల్కా బాబురావు , కవిత , లలితకుమారి, బాబు పాల్గొన్నారు.

వర్శిటీ ప్రొఫెసర్కు మరో పేటెంట్

ప్రజాశక్తి - ఎఎన్యు : అచార్య నారార్జున విశ్వవిద్యాలయం కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రామినేని శివరామ్ ప్రసాద్ మరో నూతన ఉత్పత్తిపై మేధో సంపత్తి హక్కులను దక్కించుకున్నారు. శివరామ్ప్రసాద్ ఇప్పటికే నాలుగు పేటెంట్లు దక్కించుకున్నారు. ఇంటర్నెట్ ఆప్ థింక్సను ఉపయోగించి ఉద్యోగి సామర్థ్యం, ఉత్పాదకతను నిరంతరం పర్యవేక్షించే క్రమంలో ఈ స్మార్ట్ మానిటరింగ్ పరికరాన్ని రూపొందించారు. పేటెంట్లు, డిజైన్ల చట్టం, 2000 నిబంధనలను అనుసరించి దీనికి భారత ప్రభుత్వ మేధో సంపత్తి హక్కుల పేటెంట్ కార్యాలయం పేటెంట్ను మంజూరు చేసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేకించి రిమోట్ ఏరియాలో పనిచేసే ఉద్యోగికి సంబంధించిన ఉత్పాదకను ఎప్పటి కప్పుడు లెక్కించేందుకు ఈ స్మార్ట్ డివైజ్ ఉపయోగ పడుతుందన్నారు. ఉద్యోగికి సంబంధించిన డేటా, చేయవలసిన ఉత్పాదకతలకు సంబంధించిన అంశాలను ఐఒటి విధానంలో ముందుగానే కంప్యూటర్ సిస్టమ్స్కు అనుసంధానం చేయటం ద్వారా గణనీయమైన ఫలితాలను రాబట్టవచ్చున్నారు. అయా సంస్థల సిఇఒలు జిపిఎస్ విధానాన్ని రిమోట్ ఏరియాలో పనిచేసే ఉద్యోగికి అను సంధానించటం ద్వారా ఎప్పటి కప్పుడు పూర్తి సమాచారాన్ని పొందగలుగుతారని చెప్పారు. ఈ క్రమంలో ప్రతిచోటా తెలివైన ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశం కల్పించి కార్మికుల ఉత్పాదకతను పెంపొందించమే కాక, సమాజాన్ని మరింత ప్రభావవంతంగా మార్చగలుగుతామని శివరామ ప్రసాద్ తెలిపారు.

దళితులకు ఏం చేశారో మంత్రులు చెప్పగలరా? : డాక్టర్ నిమ్మల శేషయ్య



ప్రజాశక్తి - గుంటూరు

ఈ నాలుగేళ్లలో దళితులకు ఏం మేలు చేశారో బహిరంగ వేదికలపై దళిత మంత్రులు చెప్పగలరా? అని టిడిపి నాయకులు, బిసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ నిమ్మల శేషయ్య ప్రశ్నించారు. సిఎం గడప తొక్కే ధైర్యం ఆ మంత్రులకు ఉందా? అన్నారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గుంటూరులో ఇటీవల ఒక దళితునిపై వైసిపి నేతలు దాడి చేశారని విమర్శించారు. టిడిపి ఆవిర్భావం నుంచి దళితులకు ఏంతో చేసిందని, ఈ విషయాన్ని దళితులంతా ఆలోచించాలని కోరు. దళితులు, బీసీలు, మైనారిటీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పైకి తెచ్చింది ఎన్‌టిఆర్ అని, చంద్రబాబు ఎన్నో రకాలుగా చేయూతనిచ్చారని చెప్పారు. లోక్‌సభ, అసెంబ్లీ స్పీకర్‌లుగా దళితుల్ని నియమించారన్నారు. కెఆర్ నారాయణన్‌ను రాష్ట్రపతిగా ఎన్నుకోవడంలోనూ చంద్రబాబు కీలకంగా వ్యవహరించారని అన్నారు. దళితుల కోసం చంద్రబాబు అమలుచేసిన బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు, విదేశీవిద్య, భూమి కొనుగోలు పథకం లాంటి పథకాలు వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో దళితులకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివద్ధిపై వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ఎంతమంది బహిరంగ చర్చకు వచ్చినా టిడిపి నుండి ఒక్క దళిత నాయకుడు సమాధానం చెప్పగలరని అన్నారు. రానున్న ఎన్నికల్లో దళితులంతా జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా తీర్పునివ్వాలని కోరారు.

1.26 లక్షల మందికి రైతు భరోసా



మెగా చెక్కు అందచేస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నుండి సిఎం జగన్మోహన్‌రెడ్డి వరుసగా ఐదవ సంవత్సరం వైయస్సార్ రైతు భరోసా, పీయం కిసాన్ పథకం రెండవ విడత నిధులను రైతు ఖాతాలకు జమ చేసే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని గుంటూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా తదితరులు వీక్షించారు. కార్యక్రమం అనంతరం ఐదవ సంవత్సరం రెండో విడత రైతు భరోసా, పీయం కిసాన్ పథకం ద్వారా 1,26,030 మంది రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి వ్యయం కింద రూ.51.60 కోట్ల చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా రైతులకు నాణ్యమైన వ్యవసాయ పనిముట్లు సమకూర్చుకొని, తద్వారా ఉత్పాదకతను పెంచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. 2019 నుండి క్రమం తప్పకుండా ప్రతి ఏటా ఈ పథకం ద్వారా నిధులు రైతులకు నేరుగా అందచేస్తున్నట్లు చెప్పారు. 2019 నుండి ఇప్పటి వరకు రైతులు, కౌలు రైతు కుటుంబాలను 768.69 కోట్లు డీబీటీ ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఈ ఏడాది రెండో విడతలో సుమారు 7 వేల మంది కౌలు రైతులకు సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పోరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, డైరెక్టర్ స్టేట్ ఉర్దూ అకాడమీ అబిదా బేగం, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఆత్మ పీడీ పి.రామాంజనేయులు, ఉద్యాన శాఖ డీడీ బి.రవీంద్ర పాల్గొన్నారు.

కుండల తయారీపై విద్యార్థులకు అవగాహన



ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : దీపావళి సందర్భంగా కుండల తయారీ విధానం, మండాలా ఆర్ట్ పైన కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులకు ఎసిఐసి - కెఎల్ స్టార్టప్ ఫౌండేషన్ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఎసిఐసి సిఇఒ వల్లభనేని రామన్‌కాంత్ తెలిపారు. నాలుగు రోజులు జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు కుండల తయారీ పద్ధతిని, మట్టిలోని రకాలు, వాటి గుణాలు కుండ కోసం మట్టిని ఎలా తయారు చేయాలో వివరించారు. విద్యార్థులతో వారికి నచ్చిన ఆకృతుల్లో ప్రమిదలు చేయించారు. చివరి రోజున మల్టీఆర్ట్స్ కంపెనీ తరుపున పాల్గొన్న రాధా గాయత్రీ, మమతా మండాలా ఆర్ట్ విశిష్టతను, వేయాల్సిన విధానాన్ని నేర్పించారన్నారు. కార్యక్రమంలో కెఎల్ టిఎఫ్ సిఇఒ గోవిల్ అలోక్, వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే తదితరులు

దావులూరులో సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-కొల్లిపర

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మండలంలోని దావులూరులో రూ.44 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా గాంధీజీ కలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని అన్నారు. మండలంలో 8008 మంది రైతులకు రూ.3.20 కోట్ల రైతు భరోసాను తాజాగా జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.సంధ్యాదేవి, వైస్ ఎంపిపి ఎ.బోసు, తెనాలి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎ.సీత నాగేశ్వర్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు ఎ.పోతిరెడ్డి, నాయకులు ఎ.చంద్రారెడ్డి, ఎ.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పరిధిలో అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంగళగిరి అర్బన్ సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. అనుమతులకు విరుద్ధంగా విక్రయించే బాణసంచా నిల్వలను సీజ్ చేస్తామన్నారు. తోపుడు బండ్లపై ఉంచి బాణసంచాను విక్రయించకూడదని, దుకాణాలన్నీ వేర్వేరు చోట్ల కాకుండా ఒకేచోట ఉండాలని చెప్పారు. తహశీల్దార్, కమిషనర్, అగ్నిమాపక శాఖ అధికారులు సూచించిన ప్రాంతంలోనే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

ఉదయం 5.30 గంటలకే హైదరాబాద్‌కు ఆర్టీసీ సర్వీసు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నుండి హైదరాబాద్‌కు ఈనెల 10వ తేదీ నుండి ప్రతి రోజూ ఉదయం 5.30 గంటలకు సూపర్ లగ్జరీ బస్ సర్వీసు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ గుంటూరు-2 డిపో మేనేజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల కోరిక మేరకు బస్ సర్వీసు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బస్సు ఉదయం 05:30 గంటలకు గుంటూరులో బయలుదేరి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, దాచేపల్లి మీదగా హైదరాబాద్ 11:45 గంటలకు చేరుతుందని, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి దాచేపల్లి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదగా రాత్రి 8:45 గంటలకు గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. గుంటూరు, పరిసర ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులుగా ఎదగాలి

ప్రజాశక్తి - తెనాలి

పోటీ ప్రపంచానికి దీటుగా విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞా వంతులుగా ఎదగాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, వేజళ్ల వెంకట సుబ్బారావు మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. స్థానిక ఐతా నగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్‌ఎం హైస్కూలు విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీలను ట్రస్ట్ తరపున నిర్వహించి విజేతలకు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ మాట్లాడుతూ పేద విద్యార్థులను తన తండ్రి ఎంతగానో ప్రోత్సహించే వారిని, అదే స్ఫూర్తితో ఆయన పేరుతో ట్రస్టును ఏర్పాటు చేసి జయంతి, వర్ధంతుల సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ట్రస్ట్ సభ్యులు వేజళ్ల నవ్య అందించిన మొక్కలను పాఠశాల ఆవరణలో విద్యార్థులు నాటారు. హెచ్‌ఎం రాజకిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.రాజు, ట్రస్ట్ సభ్యులు ఓంకార్ ప్రసాద్, బి శివరామకృష్ణ, బి.శివసాయిప్రసాద్, ఎన్‌సిసి ఆఫీసర్ బి.వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ట్రస్ట్ బందం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

పదేళ్లు దాటిన బాలలకు బ్యాంక్ ఖాతా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

చిన్ననాటి నుంచే పొదుపు ప్రారంభించడం ద్వారా విద్యార్థులు సరైన ఆర్థిక నిర్వహణ సామర్థ్యాన్ని కలిగి ఉంటారని ఎస్‌బిఐ ఫైనాన్స్ ఇంక్లూజిన్ మేనేజర్ ఎస్.సునీత చెప్పారు. మండలంలోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయంలో విద్యార్థులకు జీరో అకౌంట్‌లపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నేషనల్ మిషన్ ఫర్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ లో భాగంగా పదేళ్లు దాటిన వారికి అకౌంట్ ఓపెన్ చేసిన అవకాశం ఉందని చెప్పారు. ఖాతను ఓపెన్ చేయించడం, సామాజిక భద్రతను పెంపొందించడం, ఆర్థిక భద్రతపై అవగాహనను కల్పించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మురళీకృష్ణ, కల్యాణ్, బాపూజీ విద్యాలయ కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ వై.తులసీరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్జీ రంగా పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు

రైతు జన బాంధవుడు, ప్రజానేత ఆచార్య ఎన్జీరంగా పేరున సాహితీ అవార్డులు ప్రదానం చేయడం అభినందనీయమని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ రంగ 123వ జయంతి వేడుకలు, రంగ సాహిత్య పురస్కారం-2023 స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం, పద్మావతి కళా వేదికపై నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఆచార్య రంగ స్వాతంత్ర్య సమరయోధునిగా, ప్రముఖ పార్లమెంటేరియన్‌గా, రైతు జనబాంధవుడుగా, రచయితగా, సాహితీవేత్తగా, బహుముఖంగా రాణించారని కొనియాడారు. సభాధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు మాట్లాడుతూ రంగా చేసిన త్యాగాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండేందుకు ఆచార్య రంగ అభిమానులుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతి సాధించిన ఎం.వి.రామిరెడ్డి (అనిర్వచనం), ద్వితీయ బహుమతి సాధించిన అప్పలనాయుడు (అరచేతిలో బువ్వ పువ్వు)ను సత్కరించి నగదు పురస్కారం అందజేశారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ గ్రంథ సమీక్ష చేశారు. పురస్కార నివేదిక డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ సమర్పించారు. సభను డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు నిర్వహించగా కార్యక్రమంలో డాక్టర్ పాపినేని శివశంకర్, మోదుగల పాపిరెడ్డి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కేజీ శంకర్, రాష్ట్ర పాఠశాలల విద్య మానిటరింగ్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు, సాహితివేత్తలు రచయితలు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న వారిని సత్కరిస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు, తదితరులు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక ఐతానగర్‌లోని ఎంజి రంగా విగ్రహానికి పలువురు టిడిపి నాయకులు, రైతులు పూలమాలలేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు వి.శేషగిరరావు, వి.వెంకటపూర్ణచంద్, కె.వెంకటేశ్వరావు, జి.ప్రసాద్, టి.హరిప్రసాద్, ఇ.రమణ, బుచ్చిబాబు, రైతులు ఎం.చిట్టిబాబు పాల్గొన్నారు.









సత్తెనపల్లిలో బైక్ ర్యాలీ, సభలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్





గఫూర్‌కు వినతిపత్రాలిస్తున్న, స్కీమ్ వర్కర్లు, కార్మికులు



సిపిఎం ప్రజారక్షణ భేరీ యాత్రలో భాగంగా సత్తెనపల్లిలో నిర్వహించిన సభకు జనం భారీగా హాజరయ్యారు. వివిధ రంగాల కార్మికులు, స్కీమ్ వర్కర్లు తమ సమస్యలపై వినతిపత్రాలను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, బృంద నాయకులు అయిన ఎంఎ గఫూర్‌కు అందజేశారు. యాత్రకు స్వాగతం పలుకుతూ ద్విచక్ర వాహనాలతో ప్రదర్శనలు చేశారు. బహిరంగ సభ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు గేయాలు ఆలపించారు. ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పై మోపుతున్న పన్నుల భారం గురించి, ధరల గురించి పాటలు పాడారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి, సత్తెనపల్లి రూరల్, పల్నాడు జిల్లా



సత్తెనపల్లిలోసభకు హాజరైన జనం







సత్తెనపల్లి సభలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య, కె.ఉమామహేశ్వరరావు, వి.శివనాగరాణి

అడవి తక్కెళ్లపాడులో ఇళ్లపట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ళ పథకం ద్వారా ఇంటి పట్టాలు అందించడంతో పాటు, ఇళ్లను నిర్మించి ఇస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉపరవాణ కార్యాలయం సమీపంలోని దాక్షిణ్య విద్యాసంస్థల ఆవరణలో నిర్వహించిన సభలో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని అడవితక్కెళ్లపాడు ప్రాంతవాసులకు పేదలందరికీ ఇళ్ల పథకం ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా పేదలదరికీ ఇళ్ల పథకంలో జిల్లాలో దాదాపు 1.50 లక్షల మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. దీని కోసం ప్రభుత్వ భూములతో పాటు, ప్రైవేటు భూములను రూ.1451 కోట్లతో కొనుగోలు చేసి ప్రైవేటు లే ఔట్లకు దీటుగా అంతర్గత రహదారులు, లెవలింగ్ చేసి ప్లాట్లు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. వీటిలో కోర్టు కేసుల కారణంగా 1400 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేయడం నిలిచిపోయిందని, వీరికి ప్రత్యామ్నాయ స్థలాలు సేకరించి ప్రస్తుతం అడవితక్కెళ్లపాడు వాసులు 752 మందికి ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ ఇంటి పట్టాలు అందుకున్న వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ స్మిత పద్మజ, ఆర్‌అండ్‌బి కార్పొరేషన్ డైరెక్టర్ మేరి, తహశీల్దారు సాంబశివరావు పాల్గొన్నారు.



పట్టాలు అందచేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

నాగభైరవ సాహిత్య సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-గుంటూరు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, తదితరులు

ప్రిన్సిపాల్‌గా విశేష సేవలు అందించడంతోపాటు, రచయితగా, నాగభైరవ సాహిత్య పీఠం నిర్వాహకుడిగా మానవీయ విలువలతో సాహిత్య సేవల యజ్ఞం చేస్తున్న డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ సేవలు ప్రశంసనీయమని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణ వేదికపై 'భాషా విభూషణ' డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ 'మట్టి బండి' పుస్తకంపై ప్రముఖుల ప్రశంసలు కురిపించిన 'వరదగుడి' గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. శోభనాద్రీశ్వరరావు గ్రంథావిస్కరణ చేయగా, ఆచార్య ఎన్జీరంగా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు గ్రంథ స్వీకారం చేశారు. కార్యక్రమానికి తెలుగు భాషోద్యమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు అధ్యక్షత వహించారు. శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ జీవితంలోని రైతుల జీవన దుర్భర పరిస్థితులపై రాసిన మట్టి బండి పుస్తకంపై 83 వ్యాసాల ద్వారా ప్రముఖుల ప్రశంసలు అందుకోవటం డాక్టర్ ఆదినారాయణ మానవీయ కోణాలకు అద్దం పడుతుందన్నారు. బెనారస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రొఫెసర్ బూదాటి వెంకటేశ్వర్లు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కందిమళ్ల సాంబశివరావులు గ్రంథ సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, డాక్టర్ పాపినేని శివశంకర్, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, పాతూరి కోటేశ్వరరావు, డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



సుమేధాలో ఫ్యాన్సీ డ్రస్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధ హైస్కూల్లో బాలోత్సవ్-6లో భాగంగా మంగళవారం ఫ్యాన్సీ డ్రస్ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా చిన్నారులు ఝాన్సీ లక్ష్మీభాయ్, రాణిరుద్రమ దేవి, అల్లూరి సీతారామరాజు, రాజమాత, నాయకురాలు నాగమ్మ, డాక్టర్, ట్రాఫిక్ పోలీసు, సోది అమ్మాయి, న్యాయవాదులు, టీచర్, నెహ్రూ, కేరళ అబ్బాయి, రైతు, సైనికుడు తదితర వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు

కన్న స్కూల్లో ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక రైలుపేటలోని కన్న ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వివరించటంలో భాగంగా ప్రముఖ ఫొటోగ్రాఫర్ డాక్టర్ టి.ఎన్.వరప్రసాద్ ద్వారా ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్కూల్ అధినేత కన్న మాస్టారు మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించటానికి చెట్లను పెంచటం, జంతువుల్ని రక్షించటం ముఖ్యమైన మార్గమని అన్నారు. ఛాయాచిత్ర ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించి వరప్రసాద్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వివిఐటిలో సందడి చేసిన అన్వేషి చిత్రం యూనిట్

ప్రజాశక్తి - తెనాలి : ఈనెల 17న విడుదల కానున్న 'అన్వేషి' తెలుగు చలనచిత్రం యూనిట్ బృందం మంగళవారం పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సందడి చేసింది. చిత్రం ప్రచారంలో భాగంగా కళాశాలను సందర్శించిన యూనిట్ విద్యార్థులతో సెల్ఫీలకు ఫోజులిచ్చింది. విద్యార్థులతో కలిసి నృత్యాలు చేశారు. యువ నటులు విజయ్ ధరన్, సిమ్రాన్ గుప్తా హీరో హీరోయిన్లగా విజె ఖన్నా దర్శకత్వంలో శ్రీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లో తెరకెక్కనున్న మిస్టరీ థ్రిల్లర్‌గా రూపొందించిన చిత్రంలో వకీల్ సాబ్ చిత్రం ఫేమ్ అనన్య కూడా నటిస్తున్నారు. చిత్రం మంచి సందేశాత్మకంగా నిలుస్తుందని నటీనటులు తెలిపారు. హీరో, హీరోయిన్లతో పాటు జబర్దస్త్ ఫేమ్ నరేష్, నాగి చిత్ర ప్రచారంలో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి చెప్పారు.

